

ఏనుమాముల మార్కెట్‌లోని ఈవీఎం స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలిస్తున్న కలెక్టర్ సత్య శారదాదేవి

స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలించిన కలెక్టర్

వరంగల్ కలెక్టరేట్, జూన్ 18: వరంగల్ ఏనుమాముల మార్కెట్ యార్డులోని ఈవీఎం స్ట్రాంగ్ రూమ్‌లను మంగళవారం కలెక్టర్ డాక్టర్ సత్య శారదాదేవి పరిశీలించారు. వరంగల్ పార్లమెంట్ పరిధిలోని వర్ధన్నపేట, వరంగల్ తూర్పు, నర్సంపేట అసెంబ్లీ సెగ్మెంట్ల ఈవీఎం స్ట్రాంగ్ రూములను, డిస్ట్రిక్ట్ వేర్ హౌస్‌ను, గోదాంలోని రిపేర్లు అండ్ ట్రైనింగ్ ఈవీఎంల స్ట్రాంగ్ రూములను తనిఖీ చేసి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎలక్షన్ పీరియడ్ పూర్తయ్యే వరకు భద్రతా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. కాల వ్యవధి 45రోజులు పూర్తయిన తదుపరి జిల్లాలోని వర్ధన్నపేట, వరంగల్ తూర్పు, నర్సంపేట నియోజకవర్గాలకు సంబంధించిన ఈవీఎంలను వేర్‌హౌస్‌కు తరలించి భద్రత మధ్య ఉంచడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రసాద్ రావు, తహసీల్దార్ ఇక్బాల్ పాల్గొన్నారు.

సమన్వయంతో అభివృద్ధి చేద్దాం..

అన్ని శాఖల సమన్వయంతో జిల్లాను అభివృద్ధి బాటలో నడిచేలా చేద్దామని కలెక్టర్ సత్య శారదాదేవి కోరారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో అన్ని శాఖల అధికారులతో పరిచయ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అధికారులందరూ ప్రజలకు అందుబాటులో ఉంటూ, మానవతా దృక్పథంలో సేవలు అందించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు అట్టడుగు వర్గాలకు, అర్హులకు అందేలా కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు అధికారులందరూ సమిష్టిగా పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం అధికారులు కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టడంతో పుష్పగుచ్ఛాలు, పూలమొక్కలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జిల్లా పరిషత్ సీఈవో రామిరెడ్డి, డీఆర్‌డీవో కౌసల్యాదేవి, ఆర్డీవోలు సిదం దత్తు, కృష్ణవేణి, శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రైవేట్ ఆస్పత్రులు నిబంధనలు పాటించాలి..

ప్రైవేట్ ఆస్పత్రులు ప్రభుత్వ నిబంధనలు కచ్చితంగా పాటించాలని కలెక్టర్ సత్యశారదాదేవి సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని చాంబర్‌లో ప్రయివేట్ ఆస్పత్రుల రిజిస్ట్రేషన్‌పై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రిజిస్ట్రేషన్ కోసం ప్రతిపాదనలు సమర్పించుకున్న ప్రైవేట్ ఆస్పత్రులు నిబంధనలు పాటిస్తూ సేవలు అందించాలన్నారు. ఐదు ఆస్పత్రులు రిజిస్ట్రేషన్ కోసం ప్రతిపాదనలు సమర్పించగా, కమిటీ పరిశీలించి నాలుగు ప్రయివేట్ ఆస్పత్రులను ఆమోదించగా, మరో ఆస్పత్రి ప్రతిపాదనను తిరస్కరించినట్టు పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఉప అధ్యక్షుడు డాక్టర్ అజిత్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ప్రకాశ్, స్టాటిస్టికల్ అధికారి విజయలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

ధరణి పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించాలి

ధరణి పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్‌లో ధరణి దరఖాస్తుల పరిష్కారం, పురోగతిపై సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రత్యేక కార్యాచరణ అమలు చేసి వారం రోజుల్లో పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించాలన్నారు. తహసీల్దార్లు రోజువారిగా విభజించుకొని పరిష్కారం చేయాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, ఆర్డీవోలు సిదం దత్తు, కృష్ణవేణి, కలెక్టరేట్ ఏవో శ్రీకాంత్, తహసీల్దార్లు, తదితరులు పాల్గొన్నారు.

మొక్కవోని దీక్షతో..

- హరితహారానికి సన్నద్ధం
- జిల్లాలో 25.83 లక్షల మొక్కలు నాటడమే లక్ష్యం
- శాఖల వారీగా లక్ష్యాల కేటాయింపు
- 323 నర్సరీల్లో మొక్కలు సిద్ధం



ఊకల్ నర్సరీలో సిద్ధంగా ఉన్న మొక్కలు





వరంగల్ కలెక్టరేట్, జూన్ 18: జిల్లాలో హరిత హారం కార్యక్రమానికి అధికారులు సన్నద్ధమయ్యారు. ఈసారి విరివిగా మొక్కలు నాటేందుకు జిల్లా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. జిల్లాలో 25,83,550 మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అందుకు కావాల్సిన మొక్కలను జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, అటవీశాఖ ఆధ్వర్యంలో ప్రతీ గ్రామ పంచాయతీలో నర్సరీల్లో సిద్ధంగా ఉంచారు. జిల్లాలోని 323 గ్రామ పంచాయతీల్లో మొక్కలను అందుబాటులోకి తెచ్చారు. వీటిలో మూడు రకాల పండ్ల మొక్కలు, మూడు రకాల పూల మొక్కలను నర్సరీల్లో పెంచుతున్నారు. రహదారులకు ఇరువైపులా నాటేందుకు గానుక, అడవి బాదం, వేప, రావి, మర్రి, తంగేడు, నేరేడు, చింత, ఈత, టేకు, నిమ్మ, జామ, కొబ్బరి వంటి మొక్కలను సిద్ధం చేస్తున్నారు. ఈసారి పండ్ల మొక్కలతోపాటు ఆయిల్‌పామ్, కలప, నీడనిచ్చే మొక్కలను సైతం పంపిణీ చేసేందుకు రంగం సిద్ధం చేశారు. రహదారులు, ప్రభుత్వ, ప్రయివేట్ విద్యాసంస్థల్లో పెద్ద సంఖ్యలో మొక్కలు నాటేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

మండలాల వారీగా మొక్కల లక్ష్యం

హరితహారంలో భాగంగా మొక్కలను నాటేందుకు మండలాల వారీగా లక్ష్యాన్ని ఉన్నతాధికారులు నిర్దేశించారు. ఖానాపురం మండలం 2 లక్షలు, నెక్కొండ 3.90 లక్షలు, చెన్నారావుపేట 3 లక్షలు, రాయ పర్తి 3.90ల క్షలు, పర్వతగిరి 3.55లక్షలు, నర్సంపేట 2.70లక్షలు, సంగెం 3.30లక్షలు, నల్లబెల్లి 2.90లక్షలు, దుగ్గొండి 3.40 లక్షలు, వర్ధన్నపేట 1.80లక్షలు, గీసుగొండ 2.10 లక్షలు మొక్కల నాటేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు.

శాఖల వారీగా లక్ష్యాలు

జిల్లాలో హరితహారంలో భాగంగా మొక్కలు నాటేందుకు ప్రభుత్వ శాఖల వారీగా లక్ష్యాలను నిర్దేశించారు. జిల్లా పంచాయతీ శాఖ 7 లక్షల, డీఆర్‌డీఏ 6,14,250, సెరికల్చర్ 80వేలు, నర్సంపేట మునిసిపల్ కార్పొరేషన్ 1,08,500, వ్యవసాయ శాఖ లక్ష, అటవీశాఖ 50వేలు, వర్ధన్నపేట మునిసిపల్ కార్పొరేషన్ 90వేలు, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ 95వేలు, హర్టికల్చర్ 82,750, మైన్స్ జియాలజీ 8,400, యానిమల్ హజ్బెండరీ శాఖ 38,400, జిల్లా విద్యాశాఖ 50 వేలు, పౌరసరాఫరాల శాఖ 5వేలు, పరిశ్రమల శాఖ 6వేలు, అగ్రికల్చర్ మార్కెటింగ్ ఆఫీసర్ 3వేలు, జిల్లా కో ఆపరేటివ్ ఆఫీసర్ 3,150, ఫిషరీస్ 1000, ఐసీడీఎస్ 3500, వైద్య ఆరోగ్యశాఖ 2వేలు, ట్రైబల్ వెల్ఫేర్ 1400, మైనారిటీ 500, ఎస్సీ వెల్ఫేర్ 500, బీసీ వెల్ఫేర్ 1000, ఇరిగేషన్ 39,200, జీడబ్ల్యూఎంసీ 5 లక్షల మొక్కలు నాటేలా ప్రభుత్వం లక్ష్యాన్ని నిర్దేశించింది.



రాయపర్తి మండలం కొండూరులోని నర్సరీలో మొక్కలు

లక్ష్యం మేరకు మొక్కలు నాటుతాం

- కౌసల్యదేవి, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారి (డీఆర్‌డీవో)

హరితహారం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటేందుకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేశాం. దాదాపు అన్ని నర్సరీల్లో మొక్కలు అందుబాటులో ఉన్నాయి. ఇప్పటికే శాఖల వారీగా లక్ష్యాలను నిర్దేశించడం జరిగింది. తప్పనిసరిగా లక్ష్యం మేరకు మొక్కలు నాటుతాం. నర్సరీలపై నిరంతర పర్యవేక్షణకు చర్యలు తీసుకుంటున్నాం. మొక్కలు నాటడమే కాదు, పెరుగుదలపై ప్రత్యేక దృష్టి సారిస్తాం.

ప్రతీ ఇంటి నుంచి చెత్తను సేకరించాలి

- మేయర్ గుండు సుధారాణి
- పారిశుధ్య సిబ్బందితో సమీక్షా సమావేశం



మాట్లాడుతున్న మేయర్ సుధారాణి, పక్కన కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

వరంగల్ కార్పొరేషన్, జూన్ 18 : గ్రేటర్ వరంగల్ పరిధిలో ప్రతీ ఇంటి నుంచి చెత్త సేకరణ జరగాలని మేయర్ గుండు సుధారాణి అధికారులకు సూచించారు. బల్దియా ప్రధాన కార్యాలయంలో మంగళవారం బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడేతో పాటు పారిశుధ్య ఇన్‌స్పెక్టర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గుండు సుధారాణి మాట్లాడారు. ప్రతీ ఇంటి నుంచి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలని ఈ ప్రక్రియ ద్వారా చెత్తసేకరణ సులువుగా ఉంటుందన్నారు. అంతర్గత శానిటేషన్, డ్రెయినేజీలు శుభ్రంగా ఉండడం లేదని ఫిర్యాదులు వస్తున్నాయని, శానిటేషన్ అంశాలపై ఎస్‌ఐలు దృష్టి సారించాలన్నారు. ప్లాస్టిక్ మహమ్మారిని నియంత్రించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సిబ్బంది చిత్తశుద్ధితో పని చేసినప్పుడు శానిటేషన్ వంద శాతం పూర్తవుతుందన్నారు. మురికి వాడల్లో డ్రెయినేజీలు శుభ్రం చేయకపోవడంతో వర్షాకాలంలో లోతట్టు ప్రాంతాలు జలమయం అవుతున్నాయన్నారు. నగరంలో ఓపెన్ ప్లాట్లలో చెత్తా చెదారం నిండి ఉంటే జరిమానాలు విధించాలన్నారు.

కమిషనర్ అశ్విని తానాజీ వాకడే మాట్లాడుతూ.. శానిటేషన్ సిబ్బంది బయోమెట్రిక్ హాజరు తీసుకునే ప్రాంతంలో తప్పకుండా సీసీ కెమెరాలు ఉన్న ప్రాంతాన్ని ఎంచుకోవాలన్నారు. శానిటేషన్ సిబ్బందికి వారి పరిధిలో ఉన్న ప్రతీ ప్రాంతంపై పూర్తి స్థాయి అవగాహన కలిగి ఉండాలన్నారు. కాంపాక్టర్లు డంపింగ్ బిన్‌లను తొలగించే సమయంలో తప్పకుండా జియోట్యాగింగ్‌తో కూడిన ఫొటోలు తీయాలన్నారు. శానిటేషన్‌లో ఏదైనా వైఫల్యం జరిగితే దానికి సంబంధించిన అధికారులు బాధ్యత వహిస్తారన్నారు. సీఎంహెచ్‌వో డాక్టర్ మల్లం రాజేశ్, డిప్యూటీ కమిషనర్లు కృష్ణారెడ్డి, రవీందర్, ఎలక్ట్రికల్ ఈఈ సంజయ్‌కుమార్, శానిటరీ సూపర్‌వైజర్లు సాంబయ్య, భాస్కర్, శానిటరి ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

మేయర్‌ను గద్దె దించడమే మా లక్ష్యం

- రేపటి బడ్జెట్ సమావేశాన్ని బహిష్కరిస్తాం
- బల్దియా అసంతృప్త కార్పొరేటర్ల వెల్లడి



సమావేశంలో పాల్గొన్న అసంతృప్త కార్పొరేటర్లు

వరంగల్ కార్పొరేషన్, జూన్ 18 : మేయర్‌ను గద్దె దింపడమే లక్ష్యంగా పని చేస్తామని, ఈ క్రమంలో గురువారం జరిగే బల్దియా సర్వసభ్య సమావేశాన్ని బహిష్కరిస్తామని గ్రేటర్‌లోని పలువురు అసంతృప్త కార్పొరేటర్లు వెల్లడించారు. మంగళవారం బల్దియా ప్రధాన కార్యాలయంలోని డిప్యూటీ మేయర్ చాంబర్‌లో అసంతృప్త కార్పొరేటర్లు ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా 50వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్లి రవి మాట్లాడుతూ గురువారం జరిగే బడ్జెట్, సర్వసభ్య సమావేశంలో నిరసన తెలియజేయడంతో పాటు బహిష్కరిస్తామన్నారు. మెజారిటీ కార్పొరేటర్లు కోరినట్టు జనరల్ బాడీ సమావేశం ఏర్పాటు చేయకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. మేయర్ గుండు సుధారాణి నియంతృత్వ పోకడను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఇప్పటికే 22 మంది బీఆర్‌ఎస్, 10 బీజేపీ కార్పొరేటర్లు మేయర్ మొండివైఖరిని వ్యతిరేకిస్తున్నారని ఇంకా కాంగ్రెస్ నుంచి వ్యతిరేకించే వారిని అధికార పార్టీ అధిష్ఠానం అడ్డుకుంటోందన్నారు. బుధవారం బీఆర్‌ఎస్ కార్యాలయంలో సమావేశం తర్వాత అవిశ్వాసమా లేక మరేదైనా మార్గమా అనే దానిపై తుది నిర్ణయం తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ మేయర్ రిజ్వానా షమీం మసూద్, కార్పొరేటర్లు దిడ్డి కుమారస్వామి, సిద్దం రాజు, దాస్యం అభినవ్‌భాస్కర్, గుజ్జుల వసంత, సువర్ణ సురేష్, బస్వరాజు శిరీష శ్రీమాన్, సుంకరి మనిష శివ తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే జరిమానా

- వర్ధన్నపేట మునిసిపల్ కమిషనర్ జోనా



వర్ధన్నపేట, జూన్ 18: మునిసిపాలిటీ పరిధిలోని బహిరంగ ప్రదేశాల్లో చెత్తను వేస్తే జరిమానా విధిస్తామని వర్ధన్నపేట మునిసిపాలిటీ కమిషనర్ ఇ.జోనా హెచ్చరించారు. వర్ధన్నపేటలోని వరంగల్ ఖమ్మం జాతీయ రహదారిపై వ్యాపార సముదాయాల నిర్వాహకులు, మాంసం విక్రయించే నిర్వాహకులు చెత్తను ఇష్టానుసారంగా వేస్తే చట్టరీత్యా చర్యలు తీసుకోవడంతో పాటు రూ. 5వేలు జరిమానా విధిస్తామని తెలిపారు. ఆకేరు వాగు పరీవాహక ప్రాంతాల్లో సైతం చేపల వ్యాపారులు, హోటళ్ల నిర్వాహకులు చెత్తను రాత్రి వేళల్లో వేస్తున్నారని, వారిని గుర్తించి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



సమావేశంలో మాట్లాడుతున్న మార్నేని

ఉమ్మడి జిల్లాలో కొత్తగా 12 కో ఆపరేటివ్ బ్యాంకులు

- ఏర్పాటు కోసం ప్రతిపాదనలు పంపాం
- రుణమాఫీతో లక్షలాది మంది రైతులకు ప్రయోజనం
- హామీనిచ్చి నెరవేర్చడం సీఎం రేవంత్‌కే సాధ్యం
- డీసీసీబీ మేనేజింగ్ కమిటీ భేటీలో టెస్కాబ్ చైర్మన్ మార్నేని

హనుమకొండ సిటీ, జూన్ 18 : ఉమ్మడి వరంగల్ జిల్లాలో కొత్తగా 12కో ఆపరేటివ్ బ్యాంకుల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపా మని, రాష్ట్రంలో ప్రతీ రైతుకు డీసీసీబీల ద్వారా ప్రయోజనం పొందేలా ప్రభుత్వ సహకారంతో ముందుకు వెళతానని రాష్ట్ర సహ కార అపెక్స్ బ్యాంకు (టెస్కాబ్) చైర్మన్ మార్నేని రవీందర్‌రావు పేర్కొన్నారు. మంగళవారం హనుమకొండ నక్కలగుట్టలోని డీసీసీ ప్రధాన కార్యాలయంలో జరిగిన డీసీసీ బ్యాంక్ మేనేజింగ్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా కోపరేటివ్ బ్యాంకుల్లో రుణం తీసుకున్న రైతులకు రుణమాఫీకి టెస్కాబ్ నుంచి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామన్నారు. టెస్కాబ్ పరిధిలో 33లక్షల మంది రైతులు సభ్యులుగా ఉన్నారని, అయితే వీరిలో రాష్ట్ర వ్యాప్తంగా రూ.2లక్షల వరకు రుణం తీసుకున్న సుమారు 7.75లక్షల మందికి రూ.4,786కోట్ల మాఫీ ద్వారా ప్రయోజనం కలగనుందన్నారు. గత ప్రభుత్వం ఐదేళ్లలో రైతులకు లక్ష రుపాయల రుణ మాఫీ చేయలేకపోయిందని విమర్శించారు. హామీ ఇచ్చి నెరవేర్చడం.. రైతు పక్షపాతిగా ఉన్న సీఎం రేవంత్‌రెడ్డికే సాధ్యమవుతుందన్నారు. ఎంతో నమ్మకంతో తనను టెస్కాబ్ చైర్మన్‌గా నియమించిన రేవంత్‌రెడ్డి నమ్మకాన్ని వమ్ము చేయకుండా రైతులకు సేవ చేస్తానని రవీందర్‌రావు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా బ్యాంకు లావాదేవీలు, రుణాల మంజూరు, రికవరీ తదితర అంశాలపై చర్చించారు.



అక్కకుంట వద్ద కానరాని వాహనాలు
నేడు

'మట్టి దందా' బంద్

- 'ఆంధ్రజ్యోతి' కథనంతో నిర్వాహకుల్లో గుబులు
- తెల్లవారే సరికి వాహనాలు ఖాళీ..
- నిర్వాహకులు డబ్బులు ఇవ్వలేదని ఉప్పరపెల్లిలో ఆందోళన
- కాంగ్రెస్ నాయకుల మధ్య వాగ్వాదం



నిన్న
అక్కకుంటలో మట్టి తవ్వకం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

వర్ధన్నపేట రూరల్/ వర్ధన్నపేట, జూన్ 18 : మట్టి దందా శీర్షికన ఆంధ్రజ్యోతిలో మంగళవారం ప్రచురితమైన కథనం నిర్వాహకుల్లో గుబులు పుట్టించింది. ఉదయం చూసే సరికి చెరువుల్లో ప్రొక్లైనర్లు, టిప్పర్లు కనిపించకపోవడంతో గ్రామస్థులు అవాక్కయ్యారు. అధికార పార్టీ నాయకుల్లో ఎవరి హస్తం ఉందనే దానిపై వచ్చిన కథనంతో మట్టి అక్రమ తరలింపుదారులు భయపడినట్టు చర్చ జరుగుతోంది. అధికారులు సైతం మట్టి తరలింపు విషయంపై వివరణ ఇచ్చేందుకు జంకుతుండడం ఒకింత అనుమానాలకు తావిస్తోంది. అధికార పార్టీ అండదండలతోనే మట్టిని తీసిన నిర్వాహకుడు ఒక్కసారిగా నిలిపివేయడంతో ఆంధ్రజ్యోతి కథనంలో వచ్చిన నిజాలపై స్థానికులు చర్చించుకుంటున్నారు.

ఒకేసారి రెండు చోట్ల ఖాళీ..

ఉప్పరపెల్లిలో ఎల్లమ్మ చెరువులో భారీ ప్రొక్లైనర్‌తోపాటు 15 టిప్పర్లు, వర్ధన్నపేట శివారులోని అక్కకుంటలో హిటాచీతోపాటు 10 టిప్పర్లు ఏర్పాటు చేసి ఈనెల 15 నుంచి 17 వరకు పగలు, రాత్రి తేడా లేకుండా మట్టిని తరలించారు. బహిరంగంగా వరంగల్ ఖమ్మం జాతీయ రహదారిపై వెళ్తున్న మట్టి లారీలను చూసి కూడా అధికారులు పట్టించుకోలేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. అనుమతులు ఉన్నాయంటూ చెప్పారే తప్ప, వాటికి సంబంధించిన పేపర్లను చూపించకుండా దాటవేత ధోరణి ప్రదర్శించారు. పలువురు పోలీసు అధికారులు మట్టి తీసే చోట ప్రజలు ఆందోళన చేస్తే వెళ్లినప్పటికీ అనుమతుల గురించి ప్రశ్నించలేదని తెలుస్తోంది. దీంతో అధికారులపై పాత్ర ఏమైనా ఉందా అన్న కోణంలో స్థానికులు చర్చించుకుంటున్నారు. ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనానికి జంకిన మట్టి నిర్వాహకులు అధిష్ఠానం ఆదేశాల మేరకు ఖాళీ చేసినట్లుగా ప్రచారం జరుగుతోంది.

డబ్బులు ఇవ్వలేదని ఆందోళన...

ఉప్పరపెల్లిలో సోమవారం రాత్రి గ్రామస్థులు చెరువు వద్ద ఆందోళన చేసి లారీలను నిలిపివేశారు. ఏ రోజు డబ్బులు ఆ రోజే ఇచ్చే విధంగా ఒప్పందం చేసుకున్న నిర్వాహకుడు రెండు రోజులపాటు సాయంత్రం సమయంలో రూ.2.80లక్షలు అందించాడు. కానీ సోమవారం సాయంత్రం వరకు డబ్బులు ఇవ్వలేదు. దీంతో గ్రామస్థులు కొంతమంది లారీలను నిలిపి వేసి డబ్బులు ఇచ్చాకే వెళ్లాలని పట్టుబట్టారు. డబ్బులు అందలేదని తర్వాత ఇస్తా అంటూ చెప్పడమే కాకుండా నాపై విజిలెన్స్, మైనింగ్ దాడులు జరుగుతున్నాయని, నా వాహనాలను పట్టుకెళ్తున్నారని చెప్పి మట్టి నిర్వాహకుడు పరారయ్యాడని సమాచారం. ఇదిలా ఉంటే మట్టి దందా విషయంలో గ్రామపంచాయతీ కార్యాలయ పాత్రపై పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. సర్పంచ్, పాలకవర్గాలు గతంలో తీర్మాణాలు చేసి మట్టిని తీయించారు. ఇప్పుడు ప్రత్యేకపాలన ఉన్న కారణంగా మట్టి తీసేందుకు కార్యదర్శి ఎలాంటి అనుమతులు ఇచ్చాడనే విషయంపై అధికారులు ఆరా తీస్తున్నారు.

కాంగ్రెస్ నాయకుల మధ్య వాగ్వాదం...

మట్టి దందాలో కాంగ్రెస్ నాయకులు గ్రామంలో పెత్తనం చెలాయిస్తూ ముందుకు వచ్చి నిలబడ్డారు. వాహనాల తరలింపులో, గ్రామపెద్దలతో మాట్లాడటంలో ముఖ్య పాత్ర పోషించారు. దీనిపై గ్రామ కాంగ్రెస్‌లో వర్గ విభేదాలు బహిర్గతమయ్యాయి. మట్టి దందా కొంప ముంచినట్లయిందని గ్రామంలో చర్చించుకుంటున్నారు. కొంతమంది అధికార పార్టీ పేరు చెపుతూ ఇష్టానుసారంగా వ్యవహరించడం మూలంగానే మట్టి బంద్ చేశారని ఆరోపిస్తూ, గ్రామానికి వచ్చే డబ్బులు రాకుండా చేశారని వాగ్వాదానికి దిగినట్లుగా తెలుస్తోంది. ఓ కాంగ్రెస్ నాయకుడి నోటి దురుసు కారణంగానే ఇలాంటి పరిస్థితి వచ్చిందంటూ గ్రూపులుగా విడిపోయి చర్చించుకుంటున్నట్లు తెలుస్తోంది.

బంగారంతో గుమస్తా పరారీ?

మట్టెవాడ, జూన్ 18: యజమాని షాపుల్లో లేని సమయంలో గుమస్తా ఎనిమిది తులాల బంగారంతో పరారైన ఘటన వరంగల్ విశ్వకర్మ వీధిలో చోటు చేసుకున్నట్టు తెలుస్తోంది. స్థానికుల కథనం ప్రకారం. విశ్వకర్మ వీధిలోని బంగారం వ్యాపారి వద్ద బంగారాన్ని కడిగి ముద్ద చేసేందుకు మహా రాష్ట్రకు చెందిన ఓ వ్యక్తి 15 రోజుల క్రితం పనిలో చేరారు. ఈనెల 14న షాపు యజమాని వైద్య పరీక్షల నిమిత్తం షాపు నుంచి డాక్టర్ వద్దకు వెళ్లే క్రమంలో షాపులో హడావుడిలో తాళాలు మర్చిపోయాడు. ఇది గమనించిన గుమస్తా ఆ తాళాలతో షాపులో బంగారాన్ని తీసుకొని పరారయ్యాడు. కొద్ది సేపటికి కష్టమర్లు షాపు రాగా, షాపులో యజమా ని, గుమస్తా లేకపోవడంతో యజమానికి ఫోన్ చేశారు. హాస్పి టల్ వద్ద ఉన్న యజమాని హుటా హుటిన షాపు వద్దకు వచ్చాడు. గుమస్తాకు ఫోన్ చేయగా, స్విచ్ ఆఫ్ రావడం, షాపులో ఎనిమిది తులాల బంగారం లేకపోవడంతో బంగారంతో పరారైనట్టు గుర్తించాడు. అనంతరం బాధితుడు స్థానిక వ్యాపారులతో కలిసి పోలీసు ఉన్నతాధికారులకు ఈ విషయంపై ఫిర్యాదు చేశారు. బంగారంతో పరా రైన వ్యక్తి కోసం గాలిస్తున్నట్లు తెలిసింది. బంగా రంతో పరారైన మహారాష్ట్ర భాగ్యనగర్ ప్రాంతానికి చెందిన వ్యక్తి కోసం మంగళవారం వరంగల్ నుంచి ప్రత్యేక పోలీసు బృందం మహారాష్ట్రకు వెళ్లినట్లు సమాచారం.

కేసు పెట్టారన్న భయంతో గొత్తికోయ వ్యక్తి ఆత్మహత్య

ములుగు జిల్లా కన్నాయిగూడెంలో ఘటన

ఏటూరునాగారం రూరల్, 18: పోడు నరికిన కారణంగా పోలీసులు కేసు పెట్టారన్న భయంతో ఓ గొత్తికోయవాసి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలంలో మంగళవారం జరిగింది. కన్నాయిగూడెం ఎస్‌ఐ సురేష్ తెలిపిన కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. కన్నాయిగూడెం మండలం బుట్టాయిగూడెం సమీపంలోని మల్కపల్లి గొత్తికోయగూడానికి చెందిన మడకం బోగయ్య, మడకం బండయ్య, మడవి చుక్కయ్య, పద్దెం లక్ష్మయ్య సమీప అడవుల్లో పోడు నరికేందుకు గాను బుట్టాయిగూడెం గ్రామానికి చెందిన సునారికాని లక్ష్మయ్య, జనగం సమ్మయ్య వద్ద కొంత డబ్బు తీసుకొని ఒప్పందం చేసుకున్నారు. ఆ ఒప్పందంలో భాగంగా బోగయ్య, బండయ్య, చుక్కయ్య, లక్ష్మయ్య కొంతమేర పోడు కొట్టారు. ఈ విషయం తెలుసుకున్న అటవీశాఖాధికారులు పోడు నరికివేతను అడ్డుకున్నారు. ఆ తర్వాత అటవీశాఖ అధికారులు ఆ నలుగురిపై ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే అటవీశాఖాధికారులు పోలీస్‌స్టేషన్‌లో కేసు పెట్టారన్న విషయం వారికి తెలవగా.. పద్దెం లక్ష్మయ్య(40) భయంతో ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగాడు. వెంటనే కుటుంబ సభ్యులు 108లో సామాజిక ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతిచెందాడు. ఈ విషయంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు. మృతుడు లక్ష్మయ్యకు భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.


ఆత్మహత్య చేసుకున్న పద్దెం లక్ష్మయ్య

దూరవిద్య డిగ్రీ పరీక్షల్లో ఇద్దరి డీబార్

కేయూ క్యాంపస్, జూన్ 18 : కాకతీయ యూనివర్సిటీ పరిధిలో నిర్వహిస్తున్న బీఏ, బీకాం, బీఎస్సీ ఇతర డిగ్రీ కోర్సుల పరీక్షలు జరుగుతున్నాయి. జనగామ ఏబీవీ డిగ్రీ కళాశాలలో ఇద్దరు వ్యక్తులు ఒకరికిబదులుగా మరొకరు పరీక్షలు రాస్తుండగా తనిఖీ అధికారులు డీబార్ చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎన్.నరేందర్‌లు మంగళవారం తెలిపారు. వారిపై నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

కొనేదెట్టా? తినేదెట్టా?

రోజురోజుకు పెరుగుతున్న కూరగాయల ధరలు

- వారం రోజుల్లోనే రెట్టింపు
- వర్షాల్లేక, కోతుల బెడదతో దెబ్బతిన్న పంటలు
- ఏపీ, ఇతర ప్రాంతాల నుంచి దిగుమతితో మరింత భారం
- కొనలేక సామాన్యులు, పేదలు విలవిల



మహబూబాబాద్ టౌన్/తొర్రూరు/మరిపెడ జూన్ 18 : కూరగాయల రేట్లు మండిపోతున్నాయి. ఇప్పటికే బియ్యం, ఇతర నిత్యావసరాల ధరలు విపరీతంగా పెరుగుతుండగా.. కూరగాయల ధరలు కూడా రోజురోజుకు పెరుగుతుండటంతో సామాన్యులు విలవిల్లాడుతున్నారు. ధరలిలా ఉంటే కొనేదెట్టా? తినేదెట్టా? అంటూ బెంబేలెత్తిపోతున్నారు. వారం రోజులుగా మార్కెట్లలో కూరగాయల ధరలు రెట్టింపవడంతో మార్కెట్‌కు రూ.500 నోటు తీసుకువెళితే.. కనీసం వారం రోజులకు సరిపడా కూరగాయలు రాని పరిస్థితి ఉంది. ముఖ్యంగా సామాన్యులకు నిత్యం అందుబాటులో ఉండే టమాట కిలో రూ.70 పలుకుతోంది. నిన్నమొన్నటి వరకు రూ.30కి లభించిన టమాట ఇప్పుడు డబుల్ కావడంతో వినియోగదారులకు పట్టపగలే చుక్కలు కన్పిస్తున్నాయి. మృగశిరకార్తెలో ప్రవేశించి, వర్షాకాలం ప్రారంభమైనా సకాలంలో వర్షాలు కురవక పోవడం, ఎండ తీవ్రత తగ్గకపోవడం లాంటి కారణాలతో కూరగాయల పంటలు తీవ్రంగా దెబ్బతింటున్నాయి. మరో వైపు గ్రామాల్లో కోతుల బెడదతో కూరగాయల పంటలు సాగు చేసే వారి సంఖ్య తగ్గడం, ఒక వేళ సాగు చేసినా దిగుబడి తగ్గిపోతుండం కూడా కారనాలు కనిపిస్తున్నాయి. ఎప్పుడూ స్థానికంగా దొరికే కొత్తిమీర ధర గతంలో కట్టకు రూ.50 ఉంటే ప్రస్తుతం రూ.200 నుంచి రూ.300 పలుకుతోంది. ప్రస్తుతం కొత్తిమీరను మహారాష్ట్ర నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. ఇక ఆకుకూరలదీ అదే పరిస్థితి. గతంలో బచ్చలికూర, పాలకూర, గోంగూర రూ.10కి 5కట్టలు ఇస్తే ప్రసుతం ఒక్క కట్టను రూ.5కు విక్రయిస్తున్నారు. ప్రతీ రోజూ కూరగాయలకే రూ.100ఖర్చు చేయాల్సి వస్తే తమ పరిస్థితేంటని దినసరి కూలీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



మహబూబాబాద్ మార్కెట్లో కూరగాయలను విక్రయిస్తున్న మహిళ

దూర ప్రాంతాల నుంచి దిగుమతి..

ఉమ్మడి వరంగల్ జిల్లా ముఖ్యంగా మహబూబాబాద్ జిల్లాలో అత్యధికంగా గిరిజన రైతులు కూరగాయలు, ఆకుకూరల సాగు చేస్తుంటారు. ఈసారి కూడా గతం కంటే అత్యధిక రైతులు కూరగాయల పంట సాగుకు మొగ్గు చూపినా వాతావరణం అనుకూలించకపోవడంతో పంటలు దెబ్బతిన్నాయి. దీంతో వినియోగదారుల డిమాండ్‌ల కనుగుణంగా ఉత్పత్తి లేకపోవడంతో కూరగాయల మార్కెట్ వ్యాపారులు ఏపీలోని గుంటూరు, తిరుపతి, మదనపల్లి, తెలంగాణలోని బోయినపల్లి, ఒంటిమామిడి తదితర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. దీంతో రవాణాచార్జీలు ఇతరత్రా ఖర్చులతో కలిపి కూరగాయల ధరలు ఆకాశన్నంటుతున్నాయి.



వారం రోజుల్లో కూరగాయల ధరలు పెరిగాయిలా (కిలోకు)

రకం	నిన్నమొన్నటి వరకు	ప్రస్తుతం
టమాట	రూ.30	రూ.70
బీరకాయ	రూ.50	రూ.160
కాకరకాయ	రూ.50	రూ.100
దోసకాయ	రూ.20	రూ.50
దొండకాయ	రూ.20	రూ.60
గోరు చిక్కుడు	రూ.30	రూ.60
మిర్చి	రూ.50	రూ.100
మంచి చిక్కుడు	రూ.60	రూ.100
క్యారెట్	రూ.60	రూ.120
క్యాబేజీ	రూ.30	రూ.50
కొత్తిమీర	రూ.50	రూ.200
పుదీన	రూ.50	రూ.100

ధరలు పెరిగి కొనుగోళ్లు తగ్గాయి

మేదరమెట్ల వెంకట్రావు, కూరగాయల వ్యాపారి, మానుకోట



కూరగాయల ధరలు పెరగడంతో కొనుగోళ్లు తగ్గాయి. సకాలంలో వర్షాలు కురవకపోవడం, గ్రామాలు, తండాల్లో కోతుల బెడదతో కూరగాయల పంటలు చేతికి రావడం లేదు. దీంతో దూర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకుంటున్నాం. రవాణా చార్జీలు, ఇతరత్రా ఖర్చులతో కూరగాయల ధరలు పెరుగుతున్నాయి. ధరలు పెరిగి కొనుగోళ్లు తగ్గడంతో పెట్టిన పెట్టుబడులు వెళ్లడం లేదు.

దళారులకే లాభం..

రావిశెట్టి శోభ, కూరగాయల వ్యాపారి, మరిపెడ బంగ్లా



కూరగాయల విక్రయంలో దళారులకే లాభం జరుగుతోంది. పొద్దస్తమానం ఎండకిఎండి, వానకితడిచి రిటైల్ వ్యాపారం చేస్తే పూటగడవడం గగనంగా మారింది. ఇవాళ టమాట బాక్స్ రూ.1600కు హోల్‌సేల్‌గా విక్రయిస్తున్నారు. తరుగు పోను కిలోకి రూ.100కు అమ్మినా నష్టమే వస్తుంది.

కూరగాయలు కొనే పరిస్థితి లేదు

సోమ సుమతి, మహబూబాబాద్



కూరగాయల ధరలు ఆకాశన్నంటుతుండడంతో వాటిని కొనుగోలు చేయలేని పరిస్థితి. ఏ కూరగాయల ధరలను చూసిన కిలో ధర రూ.60కి పైగానే ఉంది. రూ.500 తీసుకుని మార్కెట్ వెళితే కనీసం వారం రోజులకు సరిపడ కూరగాయలు రావడం లేదు. కూరగాయల ధరలు విపరీతంగా పెరగడంతో సామన్య, మధ్య తరగతి ప్రజలపై ఆర్థిక భారం పడుతోంది. సామాన్యులు కూరగాయలు కొనలేక పచ్చళ్లతో కాలం వెల్లబుచ్చుతున్నారు.

మానుకోట జిల్లాలో 120ఎకరాల్లో కూరగాయల సాగు

రాకేశ్, ఉద్యానశాఖ అధికారి, తొర్రూరు డివిజన్



మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా 120 ఎకరాల్లో రబీ సీజన్‌లో రైతులు కూరగాయల పంటలను సాగుచేస్తున్నారు. అయితే గత రెండు నెలలుగా ఉష్ణోగ్రతలు పెరిగి పోవడంతో భూగర్భ జలాలు అడుగంటి విత్తన సమాయన రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కొన్ని మొలకలు దక్కి, కొన్ని ఎండి పోయాయి. దాంతో ఈ ఏడాది ఆశించిన విధంగా కూరగాయల పంటలు దిగుబడి కాలేదు. ఇతర రాష్ట్రాల నుంచి వ్యాపారులు కూరగాయలను దిగుమతి చేసుకుంటున్నారు.

తొర్రూరు పీఏసీఎస్ సీఈవో సస్పెన్షన్

తొర్రూరు(మహబూబాబాద్ జిల్లా), జూన్ 18 : తొర్రూరు ప్రాథమిక సహకార సంఘం సీఈవో మురళిని విధుల నుంచి తొలగించినట్లు జిల్లా సహకార సంఘం అధికారి వెంకటేశ్వర్‌రావు మంగళవారం తెలిపారు. ఇటీవల తొర్రూరు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో జీలుగ విత్తనాల విక్రయాల్లో అవకతవకలు జరిగిన నేపథ్యంలో వ్యవసాయశాఖ ఏవో కుమార్‌తో పాటు ముగ్గురు ఏఈవోలు సస్పెండ్ అయ్యారు. పీఏసీఎస్ కేంద్రాల్లో జీలుగ విత్తనాల్లో అక్రమాలు జరిగినట్లు గుర్తించడం జరిగిందని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సీఈవో మురళిని విధుల నుంచి తొలగించడం జరిగిందన్నారు. తొర్రూరు, పెద్దవంగర పీఏసీఎస్ కేంద్రాల్లో జీలుగ విత్తనాల విక్రయాలపై విచారణ కొనసాగుతుందని, నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామన్నారు.

'విద్యుత్ పోల్' పరీక్షకు ఏర్పాట్లు

- 22న ములుగురోడ్డు ఎన్‌పీటీఐ కేంద్రంలో నిర్వహణ



స్తంభాల చుట్టూ ఏర్పాట్లు చేస్తున్న విద్యుత్ సిబ్బంది

హనుమకొండ టౌన్, జూన్ 18 : జూనియర్ లైన్‌మెన్ నియామకంలో భాగంగా ఈ నెల 22న నిర్వహించే విద్యుత్ స్తంభం ఎక్కే పరీక్షకు ఎన్పీడీసీఎల్ అన్ని ఏర్పాట్లను చేసింది. 2018 ఫిబ్రవరి 16న టీజీ ఎన్పీడీసీఎల్ పరిధిలోని 16 సర్కిళ్లకు 2553 జేఎల్‌ఎంలను భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ జారీ చేయగా ఉమ్మడి జిల్లాలో 575 పోస్టుల కోసం అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. కాగా, ఈ పోస్టుల కోసం రోస్టర్ పద్ధతిలో ఇప్పటికి వరకు 6 దశల్లో పోల్ పరీక్ష నిర్వహించగా, 22న ములుగు రోడ్డులోని నార్తర్న్ పవర్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ (ఎన్‌పీటీఐ) కేంద్రంలో నిర్వహించే 7వ దశ పరీక్షకు మంగళవారం ఫోర్‌మెన్ ఆధ్వర్యంలో పరిశీలించారు. కాగా, ఈ పరీక్షకు 16 మంది అభ్యర్థులు హాజరవుతుండగా పోల్ పరీక్షను ఆపరేషన్ డైరెక్టర్ మోహన్‌రావు, హనుమకొండ, వరంగల్ జిల్లాల ఎస్‌ఈలు వెంకటరమణ, మధుసూదనరావుతో పాటు ఎన్‌పీటీఐ డీఈ, ఇతర అధికారుల పర్యవేక్షణలో నిర్వహించి పారదర్శకత కోసం వీడియోగ్రఫీ సైతం తీయడం జరుగుతుందని వెల్లడించారు. కాగా, అభ్యర్థులు దళారులను నమ్మవద్దని, తమ ఒరిజినల్ సర్టిఫికేట్స్‌తో ఉదయం 9 గంటలకు ములుగురోడ్డులోని ఎన్‌పీటీఐ కేంద్రంలో హాజరుకావాలని హనుమకొండ ఎస్‌ఈ వెంకటరమణ సూచించారు.

సివిల్ సర్వీస్ పోటీ పరీక్షకు ఉచిత శిక్షణ

హనుమకొండ కలెక్టరేట్, జూన్ 18 : సివిల్ సర్వీస్-2025 సంవత్సరంలో పరీక్ష రాసే అభ్యర్థులకు బీసీ స్టడీ సర్కిల్ ద్వారా ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ డాక్టర్ ప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన అభ్యర్థులు తమ దరఖాస్తులను ఆన్‌లైన్ ద్వారా చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 040-24071178 నెంబర్‌లో సంప్రదించాలని డైరెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

రుద్రేశ్వరుడికి ట్రెయినీ ఐఏఎస్‌ల పూజలు



రుద్రేశ్వరాలయంలో ట్రెయినీ ఐఏఎస్ అధికారులు

హనుమకొండ కల్చరల్, జూన్ 18 : నగరంలోని ప్రసిద్ధ వేయి స్తంభాల రుద్రేశ్వరాలయాన్ని మంగళవారం సాయంత్రం పలువురు ట్రెయినీ ఐఏఎస్ అధికారులు సందర్శించారు. తొలిసారిగా నగరానికి విచ్చేసిన వారు చారిత్రక వేయిస్తంభాల ఆలయ శిల్ప సౌందర్యాన్ని చూసి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. టూరిజం అధికారి శివాజీ ఆధ్వర్యంలో మనోజ్, అజ్మీర సంకేత్ కుమార్, గరిమ నరుల అభిజ్ఞాన్ మాల్వియ, మహిళా అధికారిణి ఉమా హారతి, అజయ్ యాదవ్‌లు ఆలయాన్ని సందర్శించిన అధికారుల్లో ఉన్నారు. ఇటీవల నిర్మాణం పూర్తయిన వేయిస్తంభాల కల్యాణ మండపాన్ని కూడా తిలకించారు. ఆలయ ప్రాంగణంలో అనేక ఫొటోలు దిగారు. ఆలయంలో ప్రధాన అర్చకులు గంగు ఉపేంద్రశర్మ వారికి స్వాగతం పలికి రుద్రేశ్వరుడికి వారిచే మారేడుదళ బిల్వార్చణ నిర్వహింపజేసి శేషవస్త్రాలు, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

డబుల్.. ట్రబుల్

- బీఆర్‌ఎస్ హయాంలో ఇళ్ల నిర్మాణం
- పాత వాటి విషయంలో గందరగోళం
- అద్దెకు కొన్ని.. అమ్ముకున్నవి కొన్ని ఉన్నాయనే ఆరోపణలు
- కొత్త వాటికి సంబంధించి పంపిణీ కాని పట్టాలు
- ఆందోళన బాట పడుతున్న లబ్ధిదారులు
- భూపాలపల్లిలో రోజురోజుకు జటిలమవుతున్న సమస్య



వేశాలపల్లి శివారులో నిర్మించిన డబుల్‌బెడ్ రూం ఇళ్ల సముదాయాలు

భూపాలపల్లిటౌన్, జూన్ 18 : పేదల సొంతింటి కలను నెరవేర్చడమే తమ లక్ష్యమంటూ గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణం చేపట్టింది. కానీ పేదల సొంతింటి కల నెరవేరడేమేమో గానీ సమస్య తార స్థాయికి చేరింది. ముఖ్యంగా ప్రస్తుతం ఉమ్మడి వరంగల్ జిల్లాలో భూపాలపల్లిలో నిర్మించిన డబుల్‌బెడ్‌రూం ఇళ్ల విషయం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. భూపాలపల్లి జిల్లాలో రెండుదశల్లో 960 ఇళ్లను గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిర్మించినా వాటిని సకాలంలో అర్హులకు అందించలేకపోయిందనే విమర్శలున్నాయి. మొదటి దశలో నిర్మించిన 544 ఇళ్లకు గాను లబ్ధిదారులందరికీ పట్టాలు ఇచ్చి ఇంటి నెంబర్లను కూడా కేటాయించారు. ప్రస్తుతం వాటిలో కేవలం 200 కుటుంబాలు మాత్రమే నివాసం ఉంటున్నాయి. అందులో కొందరు విక్రయించినట్లు, మరికొందరు అద్దెకు ఇచ్చినట్లు కూడా ఆరోపణలున్నాయి. ఇదిలావుండగా.. రెండవసారి 416 ఇండ్లను నిర్మించగా.. అసెంబ్లీ ఎన్నికల ముందు హడావిడిగా సుమారు 393 మందికి ఇంటి నెంబర్లు అలాట్‌చేశారు కానీ పట్టాలు ఇవ్వలేదు. లబ్ధిదారుల జాబితాను తయారు చేసినా అధికారికంగా ఎలాంటి ప్రొసీడింగ్స్ ఇవ్వకపోవడంతో గందరగోళం నెలకొంది. దీంతో రెండో దశలో ఎంపికైన లబ్ధిదారులు వరుసగా ఆందోళనలు చేస్తుండటంతో సమస్య మరింత తీవ్రమవుతోంది.

రెండు దశలు.. 960 ఇళ్లు...

భూపాలపల్లి పట్టణంలో నివసిస్తున్న పేద ప్రజలకు అర్హులైన వారికి డబుల్‌బెడ్ రూం ఇళ్లు నిర్మించి ఇచ్చేందుకు గాను గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం రెండు దశల్లో 960 ఇళ్లను నిర్మించింది. అందులో మొదటి దశలో వేశాలపల్లి శివారులో సుమారు 5ఎకరాల భూమిలో 544 ఇండ్లను నిర్మాణం చేసింది. ఈ ఇండ్లు తెలంగాణ రాష్ట్ర తొలి శాసనసభాపతి సిరికొండ మధుసూదనాచారి ఉన్నప్పుడు నిర్మించారు. అనంతరం నాటి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి ఆధ్వర్యంలో రెండోదశలో భాస్కర్‌గడ్డ శివారులో సుమారు నాలుగెకరాల్లో 416 ఇళ్లను నిర్మాణం చేశారు.

ఆందోళనలకు కారణమిదే..

వేశాలపల్లి శివారు భాస్కర్‌గడ్డ సమీపంలో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం 416 ఇళ్లను నిర్మించింది. అయితే వాటిని సకాలంలో కేటాయించకపోగా ఎవరికీ పట్టాలు ఇవ్వలేదు. పైగా అసెంబ్లీ ఎన్నికలకు ముందు హడావిడిగా ఇంటి నెంబర్లు తూతూ మంత్రంగా కేటాయించారు. 393 మంది లబ్ధిదారును గుర్తించి వారికి అలాట్‌మెంట్ చేసినట్లు అధికార యంత్రాంగం ప్రకటించింది. కానీ ఎటువంటి ప్రొసీడింగ్స్ ఇవ్వలేదు. ఈ క్రమంలో ఎన్నికల అనంతరం బీఆర్‌ఎస్ ప్రభుత్వం గద్దె దిగడం , కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో లబ్ధిదారులకు ఆందోళన మొదలైంది. తమకు ఇండ్లు దక్కుతాయో లేదోననే బెంగతో ముందస్తుగా ఆందోళనకు పూనుకున్నారు. వీరికి మద్దతుగా బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి కూడా మద్దతు పలికి ఆందోళనను ఉధృతం చేశారు. మునిసిపల్ కమిషనర్ రాజేశ్వర్ అక్కడికి చేరుకుని జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి వారికి సరైన న్యాయం చేస్తామని హామీ ఇచ్చినా వారు ఆందోళన విరమించలేదు.

544 ఇళ్ల విషయంలో సమస్యలే..

వేశాలపల్లి శివారులో నిర్మించిన 544 ఇళ్ల విషయంలో సమస్య తీవ్రతరమైంది. అందరికీ పట్టాలు ఇచ్చినా అక్కడ కేవలం సుమారు 200 కుటుంబాలు మాత్రమే ఉంటున్నాయి. ఇందులో సుమారు 20 మంది సింగరేణి కార్మికులు ఉన్నారని, 20మంది అద్దెకు ఉంటున్నారని, మరికొన్నింటిని ఉద్యోగస్తులు కొనుగోలు చేశారని విమర్శలు వస్తున్నాయి. అలాగే ఈ ఇళ్లకు ఉన్న తలుపులు, కిటికీలు, విద్యుత్ సామగ్రిని, పైపులను, ఇతరత్ర సామగ్రిని గుర్తు తెలియని దుండగులు ఎత్తుకువెళ్లారు. కానీ ఇళ్లు కేటాయించడంతో లబ్ధిదారులే వాటిని సొంత ఖర్చులతో బాగుచేసుకున్నారు. మరికొంత మంది వదిలేశారు. ఒక్కో ఇంటికి సుమారు రూ.50వేల నుంచి రూ.1లక్ష వరకు అయ్యిందని చెబుతున్నారు. ఇంకా కొన్ని ఇళ్లకు విద్యుత్ సౌకర్యం లేదు. తాగునీటి వసతి లేకపోవడంతో ఇటీవలే అధికారులు బోరు వేసి మోటారు బిగించారు కానీ.. 15కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయాల్సి ఉందని, దీంతో నీటి వసతి లేకుండా పోతుందని లబ్ధిదారులు వాపోతున్నారు. పైగా అన్నింటికి ఒకే ఒక ప్రధాన రోడ్డు ఉందని, ఒకదానికి వేర్వేరుగా వేయాలని కోరుతున్నారు.

కబ్జా బారిన రెండెకరాలు..

544 ఇళ్లు నిర్మించిన ప్రాంతంలో సుమారు ఐదెకరాల భూమిని ప్రభుత్వం కేటాయించింది. కానీ అందులో రెండు ఎకరాల భూమిని ఆటస్థలానికి, పార్కు కోసం కేటాయించారు. కానీ ఆ రెండు ఎకరాల భూమిని కొందరు వ్యక్తులు తమ అధికారాలను అడ్డంపెట్టుకుని కబ్జా చేయడానికి ప్రయత్నం చేస్తున్నట్లు ఆరోపించారు.

గత ప్రభుత్వం గందరగోళాన్ని సృష్టించింది

గండ్ర సత్యనారాయణరావు, భూపాలపల్లి ఎమ్మెల్యే



గత ప్రభుత్వం పేద ప్రజల్లో గందరగోళాన్ని సృష్టించింది. సక్రమంగా డబుల్‌బెడ్ రూం ఇళ్లు కేటాయించలేదు. అర్హులకంటే.. అనర్హులు ఎక్కువగా ఉన్నారనే సమాచారం ఉంది. కొన్నింటికి ఇంకా పట్టాలు కూడా ఇవ్వలేదు. అయితే వాటన్నింటిని పరిశీలించి అర్హులైన నిరుపేదలకు ఇంటి పట్టాలు అందించి న్యాయం చేస్తాం. మరో 15 రోజుల్లో ప్రక్రియ ప్రారంభిస్తాం.

ఉద్యోగాలు ఇప్పిస్తామని ముఠా మోసం?

మట్టెవాడ, జూన్ 18: ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మించి, డబ్బులు వసూలు చేసి, అటు ఉద్యోగం ఇప్పించక, ఇటు డబ్బులు తిరిగి ఇవ్వకపోవడంతో బాధితులు మంగళవారం పోలీసులను ఆశ్రయించినట్లు తెలిసింది. బాధితుల కథనం ప్రకారం వరంగల్ మామునూరుకు చెందిన వ్యక్తితోపాటు హనుమకొండలో నివాసం ఉంటున్న మరో నలుగురు ఒక ముఠాగా ఏర్పడి ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలు ఇప్పిస్తామని నిరుద్యోగులను నమ్మించారు. ఒక్కొక్కరి వద్ద నుంచి మూడు నుంచి నాలుగు లక్షల రూపాయలు వసూలు చేశారు. నెలలు గడిచినా ఉద్యోగాలు ఇప్పించకపోవడం, తీసుకున్న డబ్బులు తిరిగి ఇవ్వకపోవడంతో మోసపోయినట్టు బాధితులు భావించారు. వరంగల్ జిల్లాతోపాటు నిర్మల్ జిల్లా భైంసా, హనుమకొండ ఇతర జిల్లాల నిరుద్యోగుల నుంచి పెద్ద మొత్తంలో ఈ ముఠా డబ్బులు వసూలు చేసి మోసం చేశారని సమాచారం. మంగళవారం బాధితులు మట్టెవాడ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

ఆఫ్‌లైన్ గ్రాండ్ టెస్ట్‌కు దరఖాస్తుల ఆహ్వానం

హనుమకొండ కలెక్టరేట్, జూన్ 18 : తెలంగాణ ప్రభుత్వం నిర్వహించే గ్రూపు-2 పరీక్షకు హాజరయ్యే విద్యార్థినీ విద్యార్థులకు బీసీ స్టసడీ సర్కిల్ ఆధ్వర్యంలో ఆఫ్‌లైన్ గ్రాండ్ టెస్ట్‌లను నిర్వహిస్తున్నట్లు స్టడీ సర్కిల్ డైరెక్టర్ డాక్టర్ ప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మరిన్ని వివరాలకు 040-24071178 నెంబర్‌లో సంప్రదించాలని డైరెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.





నాగేంద్రుడికి మల్లెపూల అలంకరణ

గీసుగొండ, జూన్ 18: ఊకల్ నాగసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో జ్యేష్ఠమాసం గ్రీష్మరుతువు సందర్భంగా మంగళవారం నాగేంద్రుడిని మల్లెపూలతో ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు నిర్వహించారు. సకాలంలో వర్షాలు పడి పాడిపంటలు విరజిల్లాలని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు సముద్రాల సుదర్శనాచార్యులు, శ్రీహర్ష శ్రవణకుమార్, ఆలయ కమిటీ చైర్మన్ బాబురావు, ఎంపీటీసీ వీరారావు పాల్గొన్నారు.

వ్యవసాయ మార్కెట్‌ను సందర్శించిన కలెక్టర్



పత్తి విక్రయాలను పరిశీలిస్తున్న కలెక్టర్

వరంగల్ వ్యవసాయం, జూన్ 18: ఇటీవల బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్ సత్య శారదాదేవి మంగళవారం ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌ను సందర్శించారు. మార్కెట్లో ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్ రూంలను పరిశీలించారు. అనంతరం మార్కెట్లో జరుగుతున్న క్రయ విక్రయాలపై ఆరా తీశారు. పత్తి రైతును ధర అడిగి తెలు సుకున్నారు. మార్కెట్లో క్రయ విక్రయాలకు సంబంధించిన వివరాలను, వేయింగ్ మిషన్ గురించి డీఎంవో ప్రసాదరావును అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి, గ్రేడ్ 2 కార్యదర్శి రాము, గంగాధర్, తహసీల్దార్ ఎక్బాల్, ఎస్‌ఐ శ్రీకాంత్ పాల్గొన్నారు.

పలుచోట్ల భారీ వర్షం



గవిచర్లలో రహదారిపై కూలిన చెట్టు

సంగెం, జూన్ 18: భారీ వర్షంతో మంగళవారం మండల వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గవిచర్ల, సంగెం, రాంచంద్రాపురం, లోహిత, షాపూరం, తీగరాజుపల్లి, కొత్తగూడెం, తిమ్మాపురం తదితర గ్రామాల్లో మంగళవారం సాయంత్రం ఈదురుగాలులతో భారీ వర్షం పడింది. గవిచర్ల సమీపంలో నెక్కొండ- వరంగల్ ప్రధాన రహదారిపై సుమారు 25-30 ఏళ్లనాటి వృక్షాలు నేలకూలడంతో గంటన్నర పాటు ట్రాఫిక్ నిలిచిపోయింది. వాహనదారులు, పోలీసులు చెట్ల కొమ్మలను రోడ్డుపై నుంచి తొలగించారు. భారీ వర్షంతో పలు ఇళ్లల్లోకి వర్షపునీరు చేరింది.



గవిచర్లలో ఇళ్ల చుట్టూ నిలిచిన వాననీరు

మీ సేవా కేంద్రాల్లో పన్నులు చెల్లించండి

బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే



రెవెన్యూ అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ అశ్విని

వరంగల్ కార్పొరేషన్, జూన్ 18 : బల్దియా పరిధిలో ఉన్న అన్ని మీ- సేవా కేంద్రాల్లో ప్రజలు పన్నులు చెల్లించవచ్చని వరంగల్ నగర పాలక సంస్థ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే సూచించారు. మంగళవారం బల్దియా కార్యాలయంలో రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడారు. పన్నుల చెల్లింపులో 66డివిజన్ పరిధిలో ఉన్న ఇంటి యజమానులకు డిమాండ్ నోటీసులు జారీ చేయాలన్నారు. సాంకేతిక కారణాలతో ఇటీవల మీ- సేవా కేంద్రాల్లో పన్నుల చెల్లింపులు నిలిచి పోయాయని, తిరిగి పునరుద్ధరించడం జరిగిందన్నారు. జూలై 1 నుంచి యథావిధిగా పన్నుల చెల్లింపులు మీ - సేవా కేంద్రాలతోపాటు వార్డు ఆఫీస్ కార్యాలయాల్లో కొత్తగా నియమించిన రెవెన్యూ అధికారులకు చెల్లించవచ్చన్నారు. 12మీ- సేవా కేంద్రాల్లో అన్ని రకాల పన్నులు చెల్లించవచ్చని ప్రధానంగా నీటి, ఇంటి పన్నులు త్వరితగతిన వసూలు చేయాలని ఆదేశించారు. సమావేశంలో డిప్యూటీ కమిషనర్లు కృష్ణారెడ్డి, రవీందర్, ఆర్‌వోలు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులపై ఆకస్మిక తనిఖీ

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే వేటు తప్పదని నగర పాలక సంస్థ కమిషనర్ అశ్విని సిబ్బందిని హెచ్చరించారు. మంగళవారం శానిటేషన్ సర్కిల్ నెంబర్ 9 పరిధిలోని అశోక జంక్షన్, అమృత జంక్షన్, హనుమకొండ చౌరస్తాలో సిబ్బంది పనులపై ఉదయం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. కుమార్‌పల్లిలో రెండు వైపులా డ్రైనేజీలు ఉండగా ఒక వైపు మాత్రమే చెత్తను తొలగించడంపై జవాన్లను పిలిచి మందలించారు. కొందరు సిబ్బంది గైర్హాజరుకు కారణాలు, రెండు రోజులుగా ఎక్కడ పని చేస్తున్నారు, ఏం పనులు చేస్తున్నారు ? అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ఔట్ సోర్సింగ్ సిబ్బంది విధులకు రాకుండా సుదీర్ఘ కాలం పాటు గైర్హాజరైతే విధుల నుంచి తొలగించాలన్నారు. మృత పాయింట్ వద్ద సిబ్బంది అటెండెన్స్‌ను పరిశీలించారు. అనంతరం మచిలీబజార్‌లో శానిటేషన్ సిబ్బంది తీరుపై అసహనం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీఎంహెచ్‌వో డాక్టర్ రాజేశ్, శానిటరి సూపర్‌వైజర్ భాస్కర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ అనిల్ పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని వ్యక్తి విద్యుదాఘాతంతో మృతి



గీసుగొండ, జూన్ 18: విద్యు దాఘాతంతో మతిస్థిమితం లేని గురుత్తు తెలియని వ్యక్తి మంగళవారం మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు. వారి కథనం ప్రకారం. జాన్‌పాకలోని కావ్య పాలీమర్స్ పైపుల కంపెనీలో మతిస్థిమితం లేని గుర్తుతెలియని వ్యక్తి(37) ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతిచెందాడు. సదరు వ్యక్తి కొద్ది రోజులుగా మతిస్థిమితం లేకుండా జాన్‌పాక పరిసర ప్రాంతాలు బట్టలు లేకుండా సంచరిస్తున్నాడు. పైపుల కంపెనీ ప్రహరీ ఎక్కి చేతులు పైకి లేపటంతో ట్రాన్స్‌ఫార్మర్ తీగల తగిలి షాక్‌తో మృతిచెందాడు. కావ్య కంపెనీ యజమాని గవాస్కర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెంకన్న తెలిపారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు 87126 85250 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

ఒరిస్సాకు చెందిన కూలీ..



వరంగల్ చౌరస్తా, జూన్ 18: ఒరిస్సా రాష్ట్రానికి చెందిన ఓగి (50)అనే కూలీ సోమవారం వరంగల్ బస్టాండ్ ఆవరణలో మృతి చెంది కనిపించినట్లు ఇంతేజార్‌గంజ్ పోలీసులు మంగళవారం తెలిపారు. ఎల్బీనగర్‌లోని ఓ బిల్డింగ్ దగ్గర కూలీగా పనిచేస్తూ వచ్చిన డబ్బులతో ప్రతీ రోజు మద్యం సేవిస్తూ సరిగా కూలీ పనికి వెళ్లకపోవడంతో, పనికి రావద్దని చెప్పారని తెలిసింది. సోమవారం బస్టాండ్ ఆవరణలో మృతి చెంది కనిపించగా ఇతని గురించి వివరాలు తెలిసిన వారు ఇంతేజార్‌గంజ్ పోలీసు స్టేషన్‌లో సంప్రదించాలని వివరాలకు సెల్ నంబర్ :87126 85118 లో సంప్రదించాలని కోరారు.

వాహనదారులకు జరిమానా

మట్టెవాడ, జూన్ 18: వరంగల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో లైసెన్స్ లేకుండా, మద్యం తాగి వాహనం నడిపిన వాహనదారులకు వరంగల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ గుర్రపు వీరస్వామి మంగళవారం జరిమానా విధించినట్లు వరంగల్ ట్రాఫిక్ సీఐ శ్రీధర్ తెలిపారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడిపి ట్రాఫిక్ పోలీసులకు పట్టుబడిన వాహనదారుడికి రూ.వెయ్యి, మద్యం తాగి వాహనం నడిపిన ఐదుగురికి రూ.2,900 జరిమానా విధించినట్లు తెలిపారు.

కలెక్టర్‌ను కలిసిన టీఎన్‌జీవో, టీజీవో నేతలు





కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం, మొక్కను అందజేస్తున్న టీఎన్‌జీవో, టీజీవో నేతలు

వరంగల్ కలెక్టరేట్, జూన్ 18: నూతన కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ సత్య శారదాదేవిని టీఎన్‌జీవో నేతలు మంగళవారం కలెక్టరేట్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ ఉద్యోగులు తమ కర్తవ్యాన్ని నెరవేరుస్తూ జిల్లాను అభివృద్ధిలో ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. ప్రభుత్వం పథకాలను ప్రజలకు అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో టీఎన్‌జీవో అధ్యక్షుడు గజ్జెల రామ్‌కిషన్, కార్యదర్శి వేణుగోపాల్, కోశాధికారి సదానందం, హేమనాయక్, రాజు, దుర్గారావు, ఇంద్రసేనారెడ్డి, రమాదేవి, రామకృష్ణ, రాజేష్ పాల్గొన్నారు.

» కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన సత్య శారదాదేవిని తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ (టీజీవో) నేతలు మంగళవారం కలెక్టరేట్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఉమ్మడి వరంగల్ జిల్లా కో ఆర్డినేటర్ ఎ.జగన్‌మోహన్‌రావు ఆధ్వర్యంలో కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఫణి కుమార్, డాక్టర్ ప్రవీణ్ కుమార్, సంజీవరెడ్డి, కోల రాజేష్ కుమార్‌గౌడ్, నాగ నారాయణ, సుమలత, రవి, ఆంజనేయులు, రమేశ్ కుమార్‌రెడ్డి, సుదీర్ కుమార్, సాయి రాజ్ తదితరులు పాల్గొన్నారు.



బయోఫ్లాక్ ప్రారంభంలో పాల్గొన్న రైతులు, శాస్త్రవేత్తలు

చేపల పెంపకం లాభదాయకం

సంగెం, జూన్ 18: చేపల పెంపకంతో అధికలాభాలు ఉంటాయని కృషి విజ్ఞాన కేంద్ర విస్తరణ సంచాలకుడు డాక్టర్ యు.మహేందర్ చెప్పారు. మంగళవారం మామునూరులోని పీవీ నరసింహరావు పశు విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో కృషి విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన బయోఫ్లాక్ పద్ధతిలో చేపల పెంపకం యూనిట్‌ను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ బయోఫ్లాక్ పద్ధతిలో చేపల పెంపకంతో ఖర్చును తగ్గించుకోవచ్చన్నారు. కేంద్ర సమన్వయకర్త డాక్టర్ రాజన్న మాట్లాడుతూ బయోఫ్లాక్ పద్ధతిలో తక్కువ స్థలంలో ఎక్కువ చేపలను పెంచుకోవచ్చన్నారు. పిచికారి పీపీ కిట్లను, వరి విత్తనాలను, పశుగ్రాసం కత్తిరించే యంత్రాలను అందించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ సౌమ్య, డాక్టర్ రాజు, డాక్టర్ శశాంక, డాక్టర్ సాయికిరణ్, డాక్టర్ గణేష్ పాల్గొన్నారు.

బస్సుసౌకర్యం కల్పించాలని వినతి



డిపో మేనేజర్‌కు వినతి పత్రం అందిస్తున్న నాయకులు

సంగెం, జూన్ 18: షాపూర్, లోహిత, రాంచంద్రాపురం గ్రామాలకు బస్సు సౌకర్యం కలిపించాలని కాంగ్రెస్ నాయకులు హనుమకొండ డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందించారు. మంగళవారం మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన నాయకులు పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి దృష్టికి తీసుకరావడంతో ఆయన ఆదేశం మేరకు డీఎంను కలిసి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సోమిడి అంజన్‌రావు, దోనికెల శ్రీనివాస్, సత్తయ్య, బుచ్చయ్య, బాబు, రాజేశ్వర్, దేవేందర్ పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో పంటల పరిశీలన

ఐనవోలు, జూన్ 18: ఐనవోలుకు చెందిన రైతు బండారి శ్రీనివాస్ మొక్కజొన్న క్షేత్రాన్ని ఏవో కవిత మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మండలకేంద్రంలోని విత్తన షాపులో కొనుగోలు చేసిన మొక్కజొన్న విత్తనాలు విత్తాక పూర్తిస్థాయిలో మొలకెత్తలేదని ఫిర్యాదు చేశాడు. ఆయనతోపాటు మరికొందరి పంటక్షేత్రాల్లో మొలకెత్తని పరిస్థితి నెలకొందని, దీంతో విత్తన మొలక శాతాన్ని పరీక్షించేందుకు ల్యాబ్‌కు పంపించినట్లు ఏవో తెలిపారు.

పేద మహిళకు కుట్టుమిషన్ అందజేత

వరంగల్ చౌరస్తా, జూన్ 18: లయన్స్ క్లబ్ జిల్లా ఫొటోగ్రఫీ చైర్మన్ లయన్ వంగరి వేణుగోపాల్ రామన్నపేటకు చెందిన నిరుపేద వి.అరుణకు మంగళవారం కుట్టు మిషన్ అందజేశారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ క్లబ్ ప్రతినిధులు లయన్ అప్పరాజు రాజు, రావుల భాను, ఆర్‌కే రాజు, ఎం.నరహరి, పోశాల సురేందర్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాజు

'ఉన్మాదిని శిక్షించాలి'

కరీమాబాద్, జూన్ 18: పెద్దపెల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం కాట్నపల్లిలో ఆరేళ్ల చిన్నారిపై అత్యాచారం, హత్య చేసిన ఉన్మాదిని ఉరితీయాలని బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మాదాసు రాజు డిమాండ్ చేశారు. మంగళవారం కరీమాబాద్‌లో కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడుతూ నిందితుడిని శిక్షించడమేకాక, బాధిత కుటుంబానికి ప్రభుత్వం రూ.50లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించా లని డిమాండ్ చేశారు. నిందితుడిపై పోక్సో చట్టం నమోదు చేసి ఉరిశిక్ష వేయాలన్నారు. సమావేశంలో పోలేపాక మార్టి న్‌లూథర్, పోలేపాక జనార్దన్, జిలకర వీరస్వామి, మైదాన్ సుదర్శన్, తగరపు బాబు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబాన్ని ఆదుకోవాలి

ఖిలావరంగల్, జూన్ 18: కిడ్నీ వ్యాధితో బాధపడుతూ మృతి చెందిన నలిగంటి శ్రీనివాస్(45) కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం జిల్లా నాయకురాలు, మాజీ కార్పొరేటర్ నలిగంటి రత్నమాల కోరారు. మంగళవారం శ్రీనివాస్ మృతదేహానికి నివాళులర్పించారు. ఆమె మాట్లాడుతూ నగరంలో చెప్పులు కుట్టుకొని కుటుంబాన్ని పోషించుకుంటున్న శ్రీనివాస్‌కు కొన్నేళ్ల నుంచి కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాడన్నారు. శ్రీనివాస్‌కు భార్య, ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కాంపెల్లి అనిత, సౌందర్య, సునీత, సంతోష్ పాల్గొన్నారు.



శ్రీనివాస్ మృతదేహానికి నివాళులర్పిస్తున్న రత్నమాల



పాఠశాలకు వంటపాత్రలను అందిస్తున్న సమ్మయ్య

ధర్మారం పాఠశాలకు వంటపాత్రల వితరణ

గీసుగొండ, జూన్ 18: ధర్మారం జెడ్పీ పాఠశాలలో మధ్యాహ్నభోజనం వండేందుకు రూ.10 వేల విలువైన వంటపాత్రలను పాఠశాల పూర్వవిద్యార్థి సంకతాల సమ్మయ్య మంగళవారం అందచేశారు. అలాగే పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న చక్రవర్తుల శ్రీనివాస్ కూడా చిన్న వంటపాత్రలను అందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సాంబయ్య, ఉపాధ్యాయులు సూరయ్య, నజీరుద్దిన్, మల్లయ్య కో ఆప్షన్ సభ్యుడు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

ఖిలావరంగల్, జూన్ 18: విద్యార్థులు విద్యతోపాటు లలిత కళల్లో ఆసక్తిని కనబర్చాలని జాతీయ మెజీషియన్, మాయలోడు ఫేం శ్రీరాం కళ్యాణ్‌చక్రవర్తి అన్నారు. మంగళవారం మధ్యకోటలోని ప్రభుత్వ సహాయక ఆర్యాబాలుర ఉన్నత పాఠశాల పాలక పక్షాన చైర్మన్ గుజ్జారి రమేష్‌బాబు ఆధ్వర్యంలో విద్యార్థులకు బ్యాగ్‌లు, నోట్ పుస్తకాలు, పలకలు, పెన్నులు, ప్రభుత్వ యూనిఫాంలను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ పేద కుటుంబాలకు చెందిన విద్యార్థులు ప్రభుత్వ బడులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఉప్పునూతుల రవి, ఉపాధ్యాయులు తిరునగిరి నరేందర్, డి.శ్యామ్‌సుందర్, బి.పూర్ణచందర్, పి.మనోజ్, ఉషారాణి, సునీత, సుజాత, జ్యోత్స్న పాల్గొన్నారు.

పేరిణి నృత్య శిక్షణ వాల్ పోస్టర్ ఆవిష్కరణ



పోచమ్మమైదాన్, జూన్ 18: తెలంగాణ ప్రభుత్వం-భాషా సాంస్కృతిక శాఖ, నటరాజ కళాకృష్ణ నృత్యజ్యోతి అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించనున్న పేరిణి నృత్యం ఉచిత శిక్షణ శిబిరం వాల్ పోస్టర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. హైదరాబాద్ రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో ఎస్‌ఆర్‌ఐ సుభాష్, తెలంగాణ రాష్ట్ర భాషా, సాంస్కృతిక సంచాలకులు డాక్టర్ మామిడి హరికృష్ణ ముఖ్యఅతిథులుగా హాజరై ఆవిష్కరించారు. సుభాష్, హరికృష్ణలు మాట్లాడుతూ పేరిణి నృత్యం ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఒగ్గు కళాకారుడు రవి, కేంద్ర జాతీయ యువ పురస్కారగ్రహీత దస్తాద్ బిస్మిల్లా ఖాన్, పేరిణి రాజ్‌కుమార్, నాట్యాచార్యులు చాతరాజు నవ్యజ, గజ్జెల రంజిత్‌కుమార్, కళాకారులు బండారి వైష్ణవి, చంద్రకళ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

గీసుగొండ, జూన్ 18: మండలంలోని శాయంపేటహవేలి చెందిన కొంగర సదానందం, మనుగొండ గ్రామానికి చెందిన మాదాసి శ్యామల అనారోగ్యంతో చికిత్స పొందుతున్నారు. పేద కుటుంబాలకు చెందిన వారికి సామాజికవేత్త, కాంగ్రెస్ నాయకుడు అల్లం బాలకిశోర్‌రెడ్డి ఒక్కొక్కరికి రూ. 10వేల చొప్పున ఆర్థికసాయం పంపించగా, స్థానిక నాయకులు మంగళవారం అందచేశారు.

కార్యక్రమంలో నాయకులు అల్లం మర్రెడ్డి, మాదాసి రాంబాబు, గ్రామపార్టీ అధ్యక్షుడు జూల రమేష్, దాడి శివ, ప్రకాష్, వినోద్, రాజ్‌కుమార్, కమలాకర్, పరమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



డిపో మేనేజర్‌కు వినతి పత్రం అందిస్తున్న నాయకులు

బస్సు సౌకర్యం కల్పించాలని వినతి

సంగెం, జూన్ 18: షాపూర్, లోహిత, రాంచంద్రాపురం గ్రామాలకు బస్సు సౌకర్యం కలిపించాలని కాంగ్రెస్ నాయకులు హనుమకొండ డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందించారు. మంగళవారం మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన నాయకులు పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి దృష్టికి తీసుకరావడంతో ఆయన ఆదేశం మేరకు డీఎంను కలిసి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సోమిడి అంజన్‌రావు, దోనికెల శ్రీనివాస్, సత్తయ్య, బుచ్చయ్య, బాబు, రాజేశ్వర్, దేవేందర్ పాల్గొన్నారు.

వ్యవసాయ మార్కెట్‌ను సందర్శించిన కలెక్టర్



పత్తి విక్రయాలను పరిశీలిస్తున్న కలెక్టర్

వరంగల్ వ్యవసాయం, జూన్ 18: ఇటీవల బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్ సత్య శారదాదేవి మంగళవారం ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌ను సందర్శించారు. మార్కెట్లో ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్ రూంలను పరిశీలించారు. అనంతరం మార్కెట్లో జరుగుతున్న క్రయవిక్రయాలపై ఆరా తీశారు. పత్తి రైతును ధర అడిగి తెలుసుకున్నారు. మార్కెట్లో క్రయ విక్రయాలకు సంబంధించిన వివరాలను, వేయింగ్ మిషన్ గురించి డీఎంవో ప్రసాదరావును అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి, గ్రేడ్ 2 కార్యదర్శి రాము, గంగాధర్, తహసీల్దార్ ఎక్బాల్, ఎస్ఐ శ్రీకాంత్ పాల్గొన్నారు.

వేం నరేందర్‌రెడ్డి కోలుకోవాలని పూజలు



దర్గాలో పూజలు చేస్తున్న నాయకులు

పర్వతగిరి, జూన్ 18: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సలహాదారు వేం నరేందర్‌రెడ్డి అనారోగ్యంతో చికిత్స పొందుతుండగా ఆయన కోలుకోవాలని పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు మంగళవారం మండలంలోని అన్నారంషరీఫ్ గ్రామంలోని యాకూబ్‌షావలి దర్గాలో ప్రత్యేకపూజలు నిర్వహించారు. దర్గా ముజావర్లు సాంప్రదాయం ప్రకారం నాయకులతో పూజలు చే యించారు. అనంతరం పేదలకు పండ్లు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో నాయకులు గొడుగు భిక్షపతి, మునుకుంట్ల బాబు, సారంగపాణి, ఈరగాని సాంబయ్య, గొడుగు రమేష్, గాడిపెల్లి రాజబాబు, రాపోలు రవీందర్, వడ్లకొండ రవి, కొయ్యడి శ్రీధర్, గాడిపెల్లి మహేందర్, ఈరగాని అఖిల్, ముంజంపల్లి రాములు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు

- వర్ధన్నపేట ఎక్సైజ్ ఎస్ఐ సరిత
- మద్యం దుకాణాల పరిశీలన
- 'ఆంధ్రజ్యోతి' కథనంపై స్పందన

వర్ధన్నపేట, జూన్ 18 : మద్యం షాపు యజమానులు ప్రభుత్వ నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవని వర్ధన్నపేట ఎక్సైజ్ ఎస్ఐ సరిత హెచ్చరించారు. మంగళవారం పట్టణంలోని రేణుక ఎల్లమ్మ, లక్ష్మి వైన్సులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టార్లను పరిశీలించి, షాపుల్లో ఉన్న మద్యం నిల్వలు, రిజిస్టార్‌లోని వివరాలపై ఆరా తీసారు. ఈనెల 16న ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'అధికారులకు కిక్కు' అనే కథనం ఎక్సైజ్ అధికారులు స్పందించి ఈ దాడులు నిర్వహించారు. వైన్సులను పరిశీలించినట్లుగా ఉన్నతాధికారులకు చెప్పేందుకు మాత్రమే వెళ్లారే తప్ప ఎలాంటి చర్యలు తీసుకోలేదని మద్యం ప్రియులు ఆరోపిస్తున్నారు. నామమాత్రపు తనిఖీలతో చేతులు దులుపుకుంటున్న ఎక్సైజ్ అధికారుల తీరు పట్ల పలు విమర్శలు వస్తున్నాయి. తనిఖీలకు వెళ్లిన అధికారులకు సిట్టింగుల ఏర్పాటు, పర్మిట్ రూంల పరిశుభ్రత, షాపు బోర్డుల వివరాలు కనిపించడం లేదా అంటూ ప్రశ్నిస్తున్నారు.



వర్ధన్నపేటలోని ఓ వైన్స్‌లో స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న ఎస్ఐ సరిత

ప్రైవేటు సిట్టింగులపై మౌనం..

మండలంలో నాలుగు వైన్సు షాపులు ఉండగా మూడు పట్టణంలో, మరొకటి ఇల్లంద గ్రామంలో ఉంది. ఇల్లందలోని వైన్స్ షాప ఎదురుగా బారును తలిపించేలా సిట్టింగు ఏర్పాటు చేసి హోటళ్లు ఏర్పాటు చేసిన వారిపై ఎక్సైజ్, సివిల్ పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో అధికారులపై గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పర్మిట్ రూం సౌకర్యం ఉన్నప్పటికీ, ప్రైవేటు సిట్టింగులు ఏర్పాటు చేసి మద్యాన్ని 24 గంటల పాటు అమ్ముతుండడంతో గ్రామంలోని కాలనీ వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. హోటల్ పేరి చెప్పి వైన్స్ షాపు మాదిరిగి సిట్టింగులు పెట్టడం వలన రోడ్లపై వాహనాలు భారీగా ఉండడంతో రామోజీ కుమ్మరి గూడెం తండాకు వెళ్లే మహిళలు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై ఎక్సైజ్ సీఐ స్వరూప మౌనం వహించడంపై అంతర్యామేంటని స్థానికులు విమర్శిస్తున్నారు.



దుగ్గొండి పాఠశాలలో పనులు పరిశీలిస్తున్న డీఈ

పాఠశాలల పనుల పరిశీలన

దుగ్గొండి, జూన్18: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో జరుగుతున్న అమ్మ ఆదర్శ పాఠశాల పనులను డీఈ శ్రీనివాసరావు, ఏఈ వెంకటేశ్వర్లు మంగళవారం సందర్శించి పరిశీలన చేశారు. పనుల వివరాలను హెచ్ఎం రామస్వామి అధికారులకు వివరించారు. ఈసందర్భంగా డీఈ శ్రీనివాసరావు మాట్లాడుతూ పనుల వేగం పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



నోట్ పుస్తకాలు పంపిణీ చేస్తున్న చైర్మన్ మేదరి పద్మ

దుగ్గొండి, జూన్18: మండలంలోని మందపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం స్థానిక స్ఫూర్తి మహిళా సమాఖ్య సంఘం సౌజన్యంతో ఉచితంగా నోట్ పుస్తకాలు అందించగా విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ మేదరి పద్మ, హెచ్‌ఎం కర్ణకంటి రామూర్తి, ఉపాధ్యాయురాలు నిర్మల, అంగన్‌వాడీ టీచర్ గ్రేస్‌లు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల సమస్యలను పరిష్కరించాలి

నర్సంపేట ఆర్డీవోకు వ్యవసాయ కార్మిక సంఘం వినతి



ఆర్డీవో కృష్ణవేణికి వినతి పత్రం అందజేస్తున్న సంఘం నాయకులు

నర్సంపేట, జూన్ 18 : ప్రభుత్వం ఉపాధి హామీ కూలీల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మంగళవారం నర్సంపేట ఆర్డీవోకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి భూక్య సమ్మయ్య మాట్లాడుతూ.. గ్రామాల్లో రోజురోజుకు యాంత్రీకరణ పెరిగిపోవడం వల్ల కూలీలకు పని దినాలు తగ్గిపోయాయన్నారు. కూలీలకు వంద రోజుల నుంచి 150 రోజులకు పనిదినాలు పెంచాలని, పట్టణ ప్రాంతాల్లో ఉపాధి హామీ చట్టాన్ని అమలు చేసి పనులు కల్పించాలని, జాబ్‌కార్డులు లేని వారికి నూతన జాబ్‌కార్డులు అందించాలన్నారు. పనిచేసే ప్రదేశాల్లో వైద్య, తాగునీరు, నీడ సౌకర్యం కల్పించాలన్నారు. బ్యాంక్‌ల్లో సరైన సమయంలో కూలీలకు డబ్బులు ఇవ్వకపోగా ఆధార్‌కార్డు, పాన్‌కార్డు, కేవైసీ పేరుతో కూలీలను నానా ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాల్లో ఉపాధి హామీ కూలీలు పనిచేయడానికి సరైన సమయంలో పనులు గుర్తించకుండా అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని, భవిష్యత్తులో ముందే పనులను గుర్తించి గ్రామాల్లోని గ్రూపు సభ్యులందరికీ పనికల్పించే విధంగా ప్రయత్నం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు నమిండ్ల స్వామి, ఉపాధ్యక్షుడు బోళ్ల సాంబయ్య, శారద, లక్ష్మి, మొగిళి తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఎంపీ, పీఎంపీలపై దాడులు ఆపాలి



తహసీల్దార్‌కు వినతి పత్రం అందిస్తున్న ఆర్ఎంపీ, పీఎంపీలు

దుగ్గొండి, జూన్ 18: గ్రామాలలోని ఆర్ఎంపీ, పీఎంపీలపై ఐఎంఏ, టీఎస్ఎంసీ, ఎన్ఎంసీలు చేస్తున్న దాడులు ఆపాలని మండల కేంద్రంలో మంగళవారం ర్యాలీ నిర్వహించి స్థానిక తహసీల్దార్ రవి చంద్రారెడ్డికి వినతి పత్రం అందించారు. ఈసందర్భంగా ఏఐఎఫ్‌టీయూ(న్యూ) రాష్ట్ర అధ్యక్షుడు మోడెం మల్లేశం సంఘీభావం తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో అందుబాటులో ఉండి ప్రజలకు ప్రథమ చికిత్స అందిస్తున్న ఆర్ఎంపీలపై దాడులు చేయడం సరైంది కాదన్నారు. ఈకార్యక్రమంలో మండల అధ్యక్షుడు పుప్పాల శ్రీనివాస్, పాలడుగుల సాంబయ్య, కునమల్ల శ్రీనివాస్, కల్వచర్ల ఈశ్వరయ్య, రడం సుధాకర్, కిరణ్, సంకటి రమేశ్, కొలిపాక సదానందం, జీవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చేపల పెంపకం లాభదాయకం



బయోఫ్లాక్ ప్రారంభంలో పాల్గొన్న రైతులు, శాస్త్రవేత్తలు

సంగెం, జూన్ 18: చేపల పెంపకంతో అధికలాభాలు ఉంటాయని కృషి విజ్ఞాన కేంద్ర విస్తరణ సంచాలకుడు డాక్టర్ యు.మహేందర్ చెప్పారు. మంగళవారం మామునూరులోని పీవీ నరసింహ రావు పశు విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో కృషి విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన బయోఫ్లాక్ పద్ధతిలో చేపల పెంపకం యూనిట్‌ను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ బయోఫ్లాక్ పద్ధతిలో చేపల పెంపకంతో ఖర్చును తగ్గించుకోవచ్చన్నారు. కేంద్ర సమన్వయకర్త డాక్టర్ రాజన్న మాట్లాడుతూ బయో ఫ్లాక్ పద్ధతిలో తక్కువ స్థలంలో ఎక్కువ చేపలను పెంచుకోవచ్చన్నారు. పిచికారి పీపీ కిట్లను, వరి విత్తనాలను, పశుగ్రాసాల కత్తిరించు యంత్రాలను అందించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ సౌమ్య, రాజు, శశాంక, సాయికిరణ్, గణేష్ పాల్గొన్నారు.

అంతర్జాతీయ వేద జ్యోతిష సమ్మేళనానికి ఆహ్వానం

నెక్కొండ, జూన్ 18: ఇంటర్నేషనల్ ఆస్ట్రాలజీ ఫెడరేషన్ ఐపీఎఫ్ఏ ఆధ్వర్యంలో ఈ నెల 23న న్యూఢిల్లీలో నిర్వహిస్తున్న అంతర్జాతీ య వేద జ్యోతిష సమ్మేళనానికి నెక్కొండకు చెందిన జ్యోతిష వాస్తు బ్రహ్మ బూరుగుపల్లి శ్రావణ్‌శాస్త్రికి ఆహ్వానం అందింది. ఈ సందర్భంగా ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ ఇంటర్నేషనల్ వేదిక్ ఆస్ట్రాలజీ ఫెడరేషన్ యూఎస్, ఇండియా ఛార్టర్లు సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ సమ్మేళనంలో పాల్గొనేందుకు అవకాశం దక్కడంపట్ల ఆనందాన్ని వ్యక్తం చేశారు. న్యూఢిల్లీలోని ఇంటర్నేషనల్ హోటల్ రాడిసన్ బ్లూలో నిర్వహించనున్న ఈ సదస్సుకు దేశ, విదేశాల నుంచి వేద జ్యోతిష పండితులు హాజరవనున్నట్లు తెలిపారు. ఆధునిక సమాజంలో ప్రజలకు ఎదురవుతున్న సవాళ్లకు జ్యోతిష శాస్త్రం తమ పరిధిలో నూతన పరిష్కారాలు కనుగొనే దిశగా చర్చలు సాగనున్నాయన్నారు. నెక్కొండ మండలం అప్పల్‌రావుపేట హైస్కూల్‌లో ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న శ్రావణ్‌శాస్త్రి ఇటీవలనే వివాహసమయంలో జ్యోతిష ప్రభావం అనే అంశంపై పరిశోధనాత్మక వ్యాసాన్ని సమర్పించారు. తనకు అరుదైన అవకాశం కల్పించడంలో సహకరించిన నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు.



బూర్గుపల్లి శ్రావణ్‌శాస్త్రి

పలుచోట్ల భారీ వర్షం

సంగెం, జూన్ 18: భారీ వర్షంతో మంగళవారం మండల వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గవిచర్ల, సంగెం, రాంచంద్రాపురం, లోహిత, షాపూరం, తీగరాజుపల్లి, కొత్తగూడెం, తిమ్మాపురం తదితర గ్రామాల్లో మంగళవారం సాయంత్రం ఈదురుగాలులతో భారీ వర్షం పడింది. గవిచర్ల సమీపంలో నెక్కొండ- వరంగల్ ప్రధాన రహదారిపై సుమారు 25-30 ఏళ్లనాటి వృక్షాలు నేలకూలడంతో గంటన్నర పాటు ట్రాఫిక్‌కు నిలిచిపోయింది. వాహనదారులు, పోలీసులు చెట్ల కొమ్మలను రోడ్డుపై నుంచి తొలగించారు. భారీ వర్షంతో పలు ఇళ్లల్లోకి వర్షపునీరు చేరింది.



గవిచర్ల సమీపంలో నెక్కొండ-వరంగల్ రహదారిపై కూలిన వృక్షాలు

విద్యుదాఘాతంతో మతిస్థిమితం లేని వ్యక్తి మృతి

గీసుగొండ, జూన్ 18: విద్యుదాఘాతంతో మతిస్థిమితం లేని గుర్తు తెలియని వ్యక్తి మంగళవారం మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. వారి కథనం ప్రకారం... జాన్‌పాకలోని కావ్య పాలీమర్స్ పైపుల కంపెనీలో మతిస్థిమితం లేని గుర్తుతెలియని వ్యక్తి(37) ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతిచెందాడు. సదరు వ్యక్తి కొద్దిరోజులుగా మతిస్థిమితం లేకుండా జాన్‌పాక పరిసర ప్రాంతాలు బట్టలు లేకుండా సంచరిస్తున్నాడు. పైపుల కంపెనీ ప్రహరీ ఎక్కి. చేతులు పైకి లేపటంతో ట్రాన్స్‌ఫార్మర్ తీగల తగిలి షాక్‌తో మృతిచెందినట్లు తెలిపారు. కావ్య కంపెనీ యజమాని గవాస్కర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకన్న తెలిపారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు 87126 85250 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.



మృతిచెందిన గుర్తుతెలియని వ్యక్తి

చికిత్స పొందుతూ ఒకరు..

వర్ధన్నపేట, జూన్ 18: పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం ఎదుట జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. వర్ధన్నపేట ఎస్ఐ ప్రవీణ్ కుమార్ కథనం ప్రకారం.. పట్టణానికి చెందిన గాయల బాబు(49) ఈనెల 16న ఎంపీడీవో కార్యాలయం సమీపంలో వరంగల్ ఖమ్మం జాతీయ రహదారి పక్కన నిలబడి ఉండగా, వర్ధన్నపేట నుంచి రాయపర్తి వైపు వెళ్తున్న ద్విచక్ర వాహనం వేగంగా వచ్చి ఢీకొట్టింది. దీంతో తీవ్ర గాయాలైన బాబు అపస్మారక స్థితికి చేరుకున్నాడు. స్థానికులు 108 సహాయంతో వరంగల్ ఎంజీఎంకు తరలించగా మంగళవారం మృతిచెందాడు. మృతుని భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



బాబు(ఫైల్)

నాగేంద్రుడికి మల్లెపూల అలంకరణ

గీసుగొండ, జూన్ 18: ఊకల్ నాగసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో జ్యేష్ఠ మాసం గ్రీష్మరుతువు సందర్భంగా మంగళవారం నాగేంద్రుడిని మల్లెపూలతో ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు నిర్వహించారు. సకాలంలో వర్షాలు పడి పాడిపంటలు విరజిల్లాలని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు సముద్రాల సుదర్శనాచార్యులు, శ్రీహర్షశ్రవణకుమార్, ఆలయ కమిటీ చైర్మన్ బాబురావు, ఎంపీటీసీ వీరారావు భక్తులు పాల్గొన్నారు.



మల్లెపూల అలంకరణలో నాగేంద్రుడు

నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్ షిప్‌కు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

చెన్నారావుపేట, జూన్ 18:నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్ షిప్‌కు మండలంలోని అమీనాబాద్ మోడల్ పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ప్రసన్నలక్ష్మీ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రతీ సంవత్సరం అందించే నేషనల్ మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షలో పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న ఎం.అఖిల, కే శ్రీవర్షితలు ఎంపిక కావటం జరిగిందన్నారు. అనంతరం పాఠశాలలో విద్యార్థులకు ఉపాధ్యాయులు, పలువురు అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

గీత కార్మికులకు ఎక్స్‌గ్రేషియా బిల్లులను అందించాలి

చెన్నారావుపేట, జూన్ 18: గీత కార్మికులకు పెండింగ్‌లో ఉన్న ఎక్స్‌గ్రేషియాలను ప్రభుత్వం వెంటనే అందించాలని మోకు దెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అనంతుల రమేష్ డిమాండ్ చేశారు. మంగళవారం జల్లి గ్రామంలో ప్రమాదశత్తు తాటి చెట్టుపై నుంచి పడి గాయపడిన మేర్గు సంపత్‌ను ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఆరు నెలలుగా గీత కార్మికుల పెండింగ్ బిల్లులు అందించటంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కల్లు గీత కార్మికుల కోసం ప్రత్యేక కార్పోరేషన్‌ను ఏర్పాటు చేయాలన్నారు. కార్పోరేషన్‌కు రూ. 500 కోట్లను కేటాయించాలన్నారు. ఈ కార్యక్రమంలో రాజుగౌడ్, జక్కుల మధుగౌడ్, మేర్గు నవీన్, సత్యం, మల్లయ్యగౌడ్, తదితరులు పాల్గొన్నారు.



గాయపడ్డ గీతకార్మికుడిని పరామర్శిస్తున్న నాయకులు

అమరవీరుల త్యాగాలు వృథాకావు

దుగ్గొండి, జూన్18: ప్రజల కోసం పని చేసి అమరులైన వారి త్యాగాలు వృథాకావని వారు ప్రజల్లో స్థిర స్థాయిలో నిలిచిపోతారని ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కమిటీ సభ్యుడు కుసుంబ బాబురావు అన్నారు. మండలంలోని లక్ష్మీపురంలో మృతి చెందిన బొమ్మగాని చిన్న వీరయ్య 11వ వర్ధంతి సందర్భంగా మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో బాబురావు మాట్లాడారు. అమరజీవి తెలంగాణ రైతాంగ పోరాట యోధుడు మద్దికాయల ఓంకార్ నాయకత్వంలో పని చేసి నమ్మిన సిద్ధాంతం కోసం ప్రాణాలు అర్పించిన వారిలో చిన్న వీరయ్య ఒకరన్నారు. ఈ వర్ధంతి వేడుకల్లో నాగెల్లి కొంరయ్య, గడ్డమీది స్వామి, బొమ్మగాని చంద్రమౌళి, కీసరి మొగిలి, రాయరాకుల సాంబయ్య, పేరబోయిన ఐలోని, గీసుపాక కొంరయ్య, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.



లక్ష్మీపురంలో చిన్న వీరయ్య స్థూపం వద్ద నివాళి అర్పిస్తున్న ఎంసీపీఐ(యూ) నాయకులు